కాంగ్రెస్ వస్తే మళ్లీ పాత 'కాలమ్'

పటేల్ పట్వారీ వ్యవస్థ.. ఆ తర్వాత వచ్చిన రెవెన్యూ వ్యవస్థలో రైతుల తలరాతలే తలకిందులయ్యాయి. చేతిరాత రికార్డులు.. పదుల సంఖ్యలో కాలమ్స్‌తో అధికారులు రాసిందే భూమి.. చెప్పిందే లెక్కగా ఉండేది. దీంతో రాత్రి రాత్రే కౌలుదారు యజమాని అయ్యేవాడు. తన భూమి పోయిన సంగతికూడా రైతుకు తెలిసేది కాదు.. ఇప్పుడు కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే మళ్లీ ఆ పాత 'కాలమ్' వస్తుంది.

కౌలుదారు కాలమ్‌లాంటి కొత్త కొర్రీలతో రైతు భూమి ఆగమవుతుంది. తమ సొంత భూమిపై హక్కులకోసం అన్నదాతలు కాంగ్రెస్ హయాంలో ఎలాగైతే రెవెన్యూ అధికారులు, కోర్టుల చుట్టూ తిరిగారో మళ్లీ అదేరోజులు వస్తాయి. రాతపుస్తకాలతో అన్నదాత సంక్షేమసాగు వదిలి సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం పొంచి ఉన్నది.

కౌలుదారుల కాలమ్‌తో కొత్త కొర్రీలు

- మరోసారి రాత పుస్తకాలు వచ్చే ప్రమాదం
- వాటి నిర్వహణ కోసం మళ్లీ కొత్త వ్యవస్థ
- అధికారుల చేతికి మార్పులు, చేర్పుల అధికారం
- మరోసారి వీఆర్వోలు రంగ ప్రవేశం చేస్తరు
- రాత్రికి రాత్రే యజమానిగా కౌలుదారు
- పట్టా మారిందికూడా రైతులకు తెలియదు
- రైతులు రోజూ కోర్టుల చుట్టూ తిరగాల్సిందే

పాత పట్టాదారు పాస్‌బుక్‌లో ఉన్న కౌలుదారు కాలం (ఫైల్)

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): భూమి హక్కులకు సంబంధించి గతంలో అనేక రికార్డులు ఉండేవి. ముఖ్యంగా రెవెన్యూ అధికారుల చేతుల్లో 11 రకాల రికార్డులు నిర్వహించేవారు. ప్రభుత్వ, ప్రైవేట్, రైతుల భూములు ఇలా అన్ని రకాల భూముల వివరాలు వాళ్లచేతుల్లోనే ఉండేవి. ఒక్కో రికార్డులో మళ్లీ పదుల సంఖ్యలో కాలమ్స్ ఉండేవి. అధికారులే రాతపద్ధతిలో ఆ లెక్కల్లో మార్పులు, చేర్పులు చేసేవాళ్లు. ఇక్కడే విచ్చలవిడి అవినీతి జరిగేది. ముఖ్యంగా పహాణీలో అక్రమాలకు అంతులేకుండాపోయింది. రికార్డులను తమకు ఇష్టం వచ్చినట్టు మార్చిపడేసే వారు. తెల్లారేసరికి కౌలుదారు యజమాని అయ్యేవాడు.. రైతు రోడ్డున పడేవాడు. పట్టా మారిన పేరు కూడా రైతులకు తెలియకపోయేది. తాము భూముల హక్కులను కోల్పోయామన్న విషయం రైతులకు ఏండ్లకేండ్లు తెలిసేది కాదు. ఎప్పుడో.. ఇంట్లో ఏదైనా అత్యవసరం అయినప్పుడు, పిల్లల చదువులకో, పెండ్లికో భూమి ని అమ్ముకోవడానికి వెళ్తే 'భూమి నీ పేరుమీద లేదు' అని పిడుగులాంటి వార్త తెలిసేది. లబోదిబో మంటూ రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయేది. పొలంలో సాగు పనుల్లో ఉండాల్సిన రైతు.. వ్యవసాయాన్ని పక్కకు పెట్టి, పొలం పడావుపెట్టి.. ఆక్రమణదారులతో గొడవలు, వీఆర్వోల కాళ్లమీద పడటాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు, లంచాలు ఇచ్చుకోవడాలు, పోలీస్ స్టేషన్‌లో, కోర్టుల్లో కేసులు.. ఇన్ని బాధలు అనుభవించాల్సి వచ్చేది. అత్యవసరానికి భూమి ఆదుకోక.. అప్పులు పుట్టక.. పోయిన ప్రాణాలు ఎన్నో. 'మన భూమి మనకు కాకుండా పోతున్నదే..' అనే రందితో ఎంతో మంది మంచం పట్టారు. గొడవలు, అవమానాలు భరించలేక ఎందరో రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు.

అనేక రికార్డులు.. వందల్లో కాలమ్స్

భూమి హక్కులకు సంబంధించి తెలంగాణలో అనేక రికార్డులున్నాయి. పదుల సంఖ్యలో 'కాలమ్స్' ఉండేవి. ముఖ్యంగా పహాణీ, సేత్వార్, సెటిల్మెంట్ రికార్డ్స్ లేదా ఆర్ఎస్ఆర్‌ను సేత్వార్ అని పిలుస్తుంటారు. ఈ ప్రాంతంలో 1940 దశకంలో భూముల సమగ్ర సర్వే జరిగింది. ఆ సమయంలో ఏయే భూములు ఎవరి పేరుమీద ఉన్నాయి? ప్రభుత్వ భూములు, దేవాదాయ భూములు.. ఇలా క్యాటగిరీలవారీగా సమగ్ర వివరాలతో రికార్డులు రూపొందించారు. భూముల వివరాలకు ఇదే ప్రామాణికం. ఇందులో 11 కాలమ్స్ ఉన్నాయి. రెవెన్యూ అధికారులకు ఇవే ఆధారం. ప్రతిదానిలోనూ కాలమ్స్ ఉన్నాయి. అన్ని రికార్డుల్లో కలిపి మొత్తం సుమారు 200 కాలమ్స్ ఉండేవి.

దూలాలుగా మారిన మూడు 'కాలమ్స్'!

రెవెన్యూ అధికారులు నిర్వహించే రికార్డుల్లో ముఖ్యమైనది పహాణీ. ఇందులో మొత్తం 31 కాలమ్స్ ఉండేవి. సర్వే నంబర్లు, బై నంబర్ల వారీగా భూముల విస్తీర్ణం, ఇవీ ఎవరి పేరుమీద ఉన్నాయి? హక్కుదారులు ఎవరు? అనుభవదారులు ఎవరు? ఎన్నేండ్లుగా సాగు చేసుకుంటున్నారు? లాంటి వివరాలన్నీ ఉంటాయి. కాలమ్ నంబర్ 2లో సర్వే నంబర్, 3లో విస్తీర్ణం, 6లో భూమి రకం, 12లో పట్టాదారు పేరు ఉండేది. ఆ తర్వాత ఉన్న మూడు కాలమ్స్ రైతుల మెడకు దూలాలుగా మారాయి. 13వ కాలమ్‌లో అనుభవదారు పేరు, 14లో అనుభవదారు విస్తీర్ణం, 15లో అనుభవదారు స్వభావం ఉండేవి. ఏటా గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో) ఈ రికార్డును అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఇక్కడే అవినీతికి బీజం పడేది. లంచాలు తీసుకొని ముందుగా అనుభవదారు కాలంలో పేర్లు ఎక్కించేవారు. తర్వాతి ఏడాది ఏకంగా పట్టాదారుగా మార్చేసేవారు. నేరుగా పట్టాదారుగా పేర్లు మార్చిన ఉదంతాలు కూడా ఉన్నాయి. మరోవైపు కౌలు తీసుకున్న రైతులు ఒకటి రెండేండ్ల తర్వాత వీఆర్వోలకు లంచాలు ఇచ్చి అనుభవదారు కాలం నుంచి యజమాని కాలంలోకి పేర్లు మార్పించేవారు. ఉదాహరణకు.. మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలానికి చెందిన ఓ రైతుకు 7.16 ఎకరాల భూమి 1953 నుంచి పట్టా ఉండేది. అతడి మరణానంతరం ఇద్దరు కొడుకుల పేర్ల మీదికి భూమి మారింది. 1993లో అప్పటి వీఆర్వో వేరే వ్యక్తి దగ్గర లంచం తీసుకొని పహాణీల్లో ఈ భూమిని వేరే వ్యక్తి పేరుమీదికి మార్చేశారు. పట్టామార్పిడి జరిగినప్పుడు ఫారం-7లో ఎప్పుడు జరిగింది? ఎలా మారిందో వివరాలు రాయాల్సి ఉంది. కానీ ఆ వీఆర్వో ఆ వివరాలేవీ రాయలేదు. దీంతో అన్నదమ్ములు ఏండ్లపాటు అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. 2019లో 'నమస్తే తెలంగాణ' నిర్వహించిన ధర్మగంట కార్యక్రమానికి వచ్చి బాధితులు గోడు వెల్లబోసుకున్నారు. ఇది కేవలం ఒక్క ఉదాహరణ మాత్రమే. వాస్తవానికి రైతులు ఏటా ఈ పహాణీని చెక్ చేసుకొని, అందులో తమ వివరాలు సరిగా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలి. కానీ నిరక్షరాస్యత, అనుభవలేమికారణంగా ఏండ్లకేండ్లు పహాణీని చూసుకొనేవారు కాదు. ఇదే అధికారులకు ఊతంగా మారింది. రైతుల పాలిట శాపమైంది.

అధికారాలు కట్

11 రికార్డుల స్థానంలో ప్రభుత్వం 'ధరణి' పేరుతో ఒకే ఒక 'ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డు'ను అందుబాటులోకి తెచ్చింది. భూముల క్రయవిక్రయాలు పూర్తిగా డిజిటల్ పద్ధతిలో సాగుతుండటం, వెనువెంటనే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ జరిగిపోతున్నాయి. దీంతో రికార్డుల నిర్వహణకు ప్రత్యేకంగా మానవ వనరులు అవసరం లేకుండా పోయాయి.

> ధరణిలో ఉన్న రికార్డులో మార్పులు, చేర్పులు చేసే అధికారాన్ని కిందిస్థాయి అధికారులకు లేకుండా చేసింది. ఏదైనా సమస్య ఉంటే రైతు దరఖాస్తు పెట్టుకున్న తర్వాత.. కలెక్టర్ మాత్రమే పరిశీలించి మార్పు చేసే అవకాశం కల్పించింది. గతంలో మాదిరిగా వీఆర్వోలు, ఆర్ఐలు, ఎమ్మార్వోలు, ఆర్డీవోలు ఇష్టం వచ్చినట్టు రికార్డులు మార్చే సంస్కృతికి చరమగీతం పాడింది. ఏకంగా వీఆర్వో వ్యవస్థను రద్దు చేసింది.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఏమైతది?

- ధరణి పోర్టల్ రద్దయితది.
- డిజిటల్ రికార్డులు మాయం
- రాత పుస్తకాలు మళ్లీ ప్రత్యక్షం
- వాటి నిర్వహణకు వీఆర్వో వ్యవస్థ
- కాంగ్రెస్ పాస్ పుస్తకాలు వస్తాయి.
- మళ్లీ అనుభవదారు (కౌలు) కాలం
- లంచం ఇస్తే చాలు హక్కుదారుల పేర్లు మారిపోతాయి.
- రాత్రికి రాత్రే కౌలుదారు యజయాని అయిపోతాడు
- భూమిపై హక్కులు కోల్పోయిన విషయం రైతుకే తెలియదు.
- మళ్లీ కొట్లాటలు, గొడవలు
- ఊరికి నలుగురు పైరవీకారులు రంగప్రవేశం చేస్తారు.
- పొలంలో ఉండాల్సిన రైతులు అధికారులకు దండాలు పెడుతూ, ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు
- పదేండ్ల కిందటిదాకా తెలంగాణలో ఇదే కదా జరిగింది.

కాలగర్భంలోకి 'కాలమ్'లు

రైతుల బాధలను గమనించిన సీఎం కేసీఆర్.. కొత్త చట్టానికి రూపకల్పన చేశారు. దీని ప్రకారం రైతుల భూముల వివరాలన్నీ డిజిటలైజ్ అయ్యాయి. అన్ని రకాల రికార్డుల స్థానంలో ఒకే ఒక 'ఆన్‌లైన్ రికార్డు' అందుబాటులోకి వచ్చింది. అన్నింటికన్నా ముఖ్యంగా కౌలు కాలమ్ కాలగర్భంలో కలిసింది. 'కౌలు రైతులను మేం గుర్తించం. కౌలు అంటే ఇల్లు కిరాయికి ఇచ్చినట్టే పొలం కిరాయికి ఇవ్వడం. బంజారాహిల్స్‌లో ఉన్న బంగ్లాలు కిరాయికి ఇస్తరు కదా. అక్కడ కూడా కబ్జాదారు కాలమ్ పెట్టి హక్కులు ఇస్తామంటే ఒప్పుకుంటరా?' అని సీఎం కేసీఆర్ పదే పదే ప్రస్తావించేవారు. దీంతోపాటు కౌలు రైతులు ఎప్పటికప్పుడు మారిపోతుంటారని, ఎవరు తక్కువ కౌలుకు ఇస్తే వారికి చేస్తుంటారని, అది రైతుకు, కౌలు రైతుకు మధ్య అవగాహన అని చెప్పారు. అందుకే ప్రభుత్వం ఎప్పటికీ కౌలు రైతులను గుర్తించదని స్పష్టం చేశారు. ఈ మేరకు రికార్డుల నిర్వహణలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. పాత పాస్‌పుస్తకాల స్థానంలో కొత్త పాస్ పుస్తకాలు మంజూరు చేశారు. ఇందులో రైతు పేరు, విస్తీర్ణం, ఇతర వివరాలు మాత్రమే ఉంటాయి. గతంలో పట్టాదారు పాస్ పుస్తకం, టైటిల్ డీడ్ (భూమి యాజమాన్య హక్కు పత్రం) ఉంటేనే పూర్తి హక్కులు ఉండేవి. రెండింటిలో కలిపి 20 కాలమ్స్ ఉండేవి. కానీ కొత్త పాస్ పుస్తకంలో వాటన్నింటికీ చరమగీతం పాడారు. బ్యాంకు పాస్‌పుస్తకాల మాదిరిగానే.. రైతుల భూములు మార్పిడి జరిగినప్పుడే పుస్తకంలో ప్రింట్ చేసి ఇచ్చేలా విప్లవాత్మక మార్పు తెచ్చారు.

మళ్లీ పాత.. రాత పద్ధతే తెస్తారట

'మేం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో రెవెన్యూ రికార్డుల్లో ఉన్న కాలమ్స్‌ను తిరిగి తెస్తాం. కౌలు రైతుల కోసం ప్రత్యేకంగా కాలమ్ తెస్తాం' అని ఇటీవల కాంగ్రెస్‌కు చెందిన సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మరోవైపు ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో పడేస్తామని కాంగ్రెస్ మొదటి నుంచీ చెప్తున్నది. అంటే రైతుల భూముల హక్కులపై వేటు వేసేందుకు కత్తి పట్టుకొని సిద్ధంగా ఉన్నదన్నమాట. 'కౌలు రైతులను గుర్తించి రైతుల మెడకు దూలం కట్టదలుచుకోలేదు' అని సీఎం కేసీఆర్ చెప్పేవారు. ఆ మాట మీదే నిలబడ్డారు. కానీ కాంగ్రెస్ నాయకులు అధికార యావతో 65 లక్షల మంది రైతుల కుటుంబాల నోట్లో మట్టి కొట్టేందుకు సిద్ధమయ్యారు. రికార్డుల్లో కాలమ్‌లు మళ్లీ వస్తే.. వాటిని ఎవరు నిర్వహించాలి?. అంటే మళ్లీ పాత అధికార వ్యవస్థను తెచ్చి, వారికి మార్పులు, చేర్పులు చేసే అవకాశం ఇస్తారన్నమాట. బాజాప్తా వారి మ్యానిఫెస్టోలోనే వీఆర్వోలను నియమిస్తామన్నారు. దీనినిబట్టే మళ్లీ వీఆర్వో వ్యవస్థను తెస్తారని స్పష్టమవుతున్నది. లంచగొండి వ్యవస్థకు ప్రాణం పోసి, అడ్డగోలుగా సంపాదించుకోవాలని ఎత్తులు వేస్తున్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్‌ది ఘోర వైఫల్యం

- ఐదు గ్యారెంటీలకు నిధుల్లేవ్
- నో డెవలప్‌మెంట్.. నో గవర్నెన్స్
- తెలంగాణలో ఆరు గ్యారెంటీలను నమ్మరు
- మాజీ డిప్యూటీ సీఎం అశ్వత్ నారాయణ

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ఘోరంగా విఫలమైందని బీజేపీ నేత, కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం అశ్వత్ నారాయణ వివర్శించారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆరు గ్యారెంటీలంటూ తెలంగాణ ప్రజలను మభ్యపెడుతున్నదని మండిపడ్డారు. ఆయన సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కర్నాటకలో ఇచ్చిన ఏ హామీనీ కాంగ్రెస్ నిలబెట్టుకోలేదని చెప్పారు. అమలుసాధ్యం కాని హామీలు ఇచ్చి, మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఆర్భాటంగా ప్రకటించిన ఐదుగ్యారెంటీల అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. 'నో డెవలప్‌మెంట్, నో గవర్నెన్స్' మాడల్‌ను అమలు చేస్తున్నదని ఎద్దేవా చేశారు. వాళ్లు చెప్పిన గ్యారెంటీలు, పనులకు నాలుగునెలల్లో కనీసం పది శాతం నిధులు కూడా విడుదల చేయలేదని తెలిపారు. అన్నభాగ్య పథకం కింద పదికిలోల బియ్యం అన్నారని, కానీ ఐదు కిలోలు కూడా ఇవ్వడం లేదని చెప్పారు. శక్తి కార్యక్రమం కింద మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నారని, ఉచిత ప్రయాణానికి సహకరిస్తున్న ఆర్టీసీకి నిధులు విడుదల చేయలేదని అన్నారు. పైగా బస్సుల సంఖ్యను తగ్గించారని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఒకప్పుడు మిగులు విద్యుత్తు ఉన్న కర్ణాటకలో ఇప్పుడు విద్యుత్తు కోతలు పడుతున్నాయని చెప్పారు. అలాంటి విఫల కర్ణాటక మాడల్‌ను చూపుతూ.. తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

ధరణితో రైతుకు భరోసా

- పాత విధానం వల్ల భూకబ్జాలు
- ఓయూ మాజీ వీసీ సత్యనారాయణ

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): 'సొమ్ము ఒకరిదైతే.. సోకు మరొకరిది.. అన్న చందంగా ఉండేది ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ భూముల పరిస్థితి. పాత విధానంలో భూ హక్కదారులు ఒకరుంటే.. అనుభవదారుడు మరొకరు ఉండేవారు. గత పాలనలో కొనసాగిన భూ రికార్డుల విధానాల వల్ల రైతులకు సంబంధించిన అనేక భూములు కబ్జాలకు గురయ్యాయి' అని ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సత్యనారాయణ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ధరణి పోర్టల్‌తో భూముల విషయంలో పారదర్శకత ఏర్పడిందని చెప్పారు. మళ్లీ పాత విధానం అమలులోకి వస్తే భూకబ్జాలు కూడా జోరందుకుంటాయని ఆందోళన వ్యక్తంచేశారు. ధరణి పోర్టల్‌తో రైతులకు తమ భూములపై భరోసా ఏర్పడిందని 'నమస్తే తెలంగాణ'తో చెప్పారు.

రైతు భరోసా ధరణి..

ధరణిలో పేరు ఉంటే భూములు కబ్జా కావు అన్న భరోసా వచ్చింది. వ్యవసాయ భూములపై యాజమాన్య హక్కులు ఉన్న వారి పేర్లన్నీ ఈ పోర్టల్‌లోకి వచ్చాయి. దీనిపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. భూ యాజమాన్య హక్కులు ఎవరి పేరు మీద ఉన్నాయో.. వారి బ్యాంకు ఖాతాల్లోనే రైతుబంధు పథకం డబ్బులు జమ అవుతున్నాయి. దీంతో రైతుబంధు పథకం పగడ్బందీగా అమలవుతున్నది. కబ్జాలు చేస్తున్న వారికి మాత్రం ధరణి పోర్టల్ ఇబ్బందిగానే మారింది' అని సత్యనారాయణ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రగతికి ఇస్తున్న ప్రాధాన్యంలో వ్యవసాయ రంగం మొదటి స్థానంలో ఉందని సత్యనారాయణ అన్నారు.

మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ. పక్కన ఖాజా బద్రూద్దీన్, భరత్‌కుమార్

ముస్లింలకు రేవంత్ దొంగ హామీలు

- ఆ మాటలు నమ్మి మోసపోవద్దు
- మహమూద్ ఆలం పెద్ద కబ్జాకోరు, నంబర్‌వన్ లోఫర్
- సీఎం కేసీఆర్ పాలనలోనే ముస్లింలకు పెద్దపీట
- హోం మంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): ముస్లిం నాయకులకు ఎమ్మెల్సీ ఇస్తానంటూ రేవంత్‌రెడ్డి ప్రలోభ పెడుతున్నాడని, ఆ మాటలు నమ్మొద్దని హోం మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా.. అక్కడి ముస్లిం నేతలకు ఎమ్మెల్సీలు ఇస్తానని దొంగ హామీలు ఇస్తున్నారని విమర్శించారు. రేవంత్ మోసపూరిత మాటలు నమ్మిన మహబూబ్ ఆలం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పంచన చేరారని చెప్పారు. తెలంగాణ భవన్‌లో హోం మంత్రి సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. నిన్నటిదాకా బీఆర్ఎస్‌లో ఉన్న మహబూబ్ ఆలం ఇప్పుడు దేవుడి లాంటి కేసీఆర్‌పై ఆరోపణలు చేయడం బాధాకరం అని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పాలనలోనే వక్ఫ్ భూములు ఆక్రమణకు గురయ్యాయని ఆరోపిస్తున్న మహబూబ్ అలం పెద్ద కబ్జాకోరు, నంబర్‌వన్ లోఫర్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మలక్‌పేట, మల్లేపల్లి, చంచల్‌గూడ వంటి ఐదు ప్రాంతాల్లో వక్ఫ్ భూములు కబ్జా చేసి, కాలేజీలు కట్టాడని ఆరోపించారు. కేసీఆర్ పాలనలోనే ముస్లిం మైనార్టీలకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. స్వరాష్ట్రం సాధించిన తర్వాత వక్ఫ్ భూములను కాపాడేందుకు కేసీఆర్ 22/ఏ జీవోను తీసుకొచ్చి, భూముల పరిరక్షణకు అండగా నిలిచారని చెప్పారు. ధరణి నుంచి కూడా వక్ఫ్ భూములకు రక్షణ దొరికిందని అన్నారు. మోసకారి అయిన రేవంత్‌రెడ్డి మాటలు విని.. బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేయడం వారి సిగ్గుమాలిన తనానికి నిదర్శనం అని మండిపడ్డారు. రేవంత్ గెలిచింది లేదు.. సచ్చింది లేదు.. అతను ఇస్తానన్న ఎమ్మెల్సీలకు ఆశపడి బీఆర్ఎస్ పార్టీపై నిందలు వేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి రాకతో కాంగ్రెస్ పార్టీ సంఘ్ పరివార్ చేతుల్లోకి వెళ్లిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మైనార్టీ ఇంచార్జ్ ఖాజా బద్రూద్దీన్, తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ సోమా భరత్‌కుమార్ పాల్గొన్నారు.

10 హెచ్‌పీ భస్మాసుర 'హస్తం'

రాష్ట్ర రైతాంగంపై 30,000 కోట్ల భారం • ఒక్కో 10 హెచ్‌పీ మోటరు పంపు, పైపులు, వైర్లు, స్టార్టర్లకు సగటున లక్షకుపైగా ఖర్చు

ఒక్కొక్క రైతుపై ఉన్నపళంగా కనీసం రూ.1.10 లక్షల ఆర్థికం భారం మోపి, వారిని అప్పుల ఊబిలోకి ఈడ్చుకెళ్లేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తున్నదా? రాష్ట్ర రైతాంగంపై ఏకంగా రూ.30,000 కోట్ల భారం మోపి వారిని రుణగ్రస్థులుగా మార్చడమే ఎజెండాగా పెట్టుకున్నదా? పొలాల్లో, బాయిలకాడ 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటూ ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రచారం చూస్తుంటే ఇలాంటి అభిప్రాయమే కలుగుతున్నది. తమపై కాంగ్రెస్ ఎందుకు ఇంతలా కక్ష కడుతున్నదని రైతులు ఆగ్రహంగా ప్రశ్నిస్తున్నారు.

- మెకానిక్, కూలీల ఖర్చు మరికొంత అదనం
- రైతులను ఆర్థికంగా దెబ్బ తీసేందుకు కాంగ్రెస్ కుట్ర
- రాష్ట్రంలోని 28 లక్షల మంది రైతులపై పిడుగుపాటు
- మోటరు మార్చినా పంటల దిగుబడిలో తేడా సున్నా

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నాయకులు చెప్తున్నట్టుగా వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటర్లు కొనుగోలు చేయాలంటే రాష్ట్ర రైతాంగంపై ఏకంగా రూ.30,000 కోట్ల భారం పడుతుంది. మోటర్లు, ఇతర పరికరాల కొనుగోలు కోసమే ఒక్కొక్క రైతు కనీసం రూ.లక్షకు పైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. మెకానిక్, కూలీల కోసం మరికొంత అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. తెలంగాణ రైతాంగం ఇంత భారం మోయగలదా? అసలు రైతులు ఎందుకు ఈ భారాన్ని మోయాలి? దీనివల్ల వచ్చే అదనపు ప్రయోజనం ఏమైనా ఉన్నదా? ఏ ప్రభుత్వమైనా ప్రజల కష్టాలను తొలగించే పథకాలను అమలుచేయాలి. కానీ, కాంగ్రెస్ అందుకు విరుద్ధంగా ఆలోచిస్తున్నది. రైతుల నెత్తిన భస్మాసుర హస్తం మోపే విధానాలను ఎజెండా మీదకు తెస్తున్నది. వ్యవసాయానికి కేవలం 3 గంటలపాటు విద్యుత్తు ఇస్తే సరిపోతుందని, అందుకు ప్రతి రైతూ 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్ల స్థానంలో 10 హెచ్‌పీ మోటార్లు కొనుగోలు చేయాలని వాదిస్తున్నది. వ్యవసాయం గురించి ఏమీ తెలియని కాంగ్రెస్ నేతలు చెప్తున్న మాటలను నమ్మితే తెలంగాణ రైతాంగం ఇక్కట్ల పాలవుతారనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతున్నది. మౌలిక, నిర్మాణ, పారిశ్రామికరంగాల్లో అత్యధికంగా వినియోగించే 10 హెచ్‌పీ మోటర్లను వ్యవసాయానికి వాడాలని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రచారంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

10 హెచ్‌పీ మోటర్లకు అయ్యే ఖర్చులు

బ్రాండెడ్ మోటర్ సగటు ధర	రూ.50,000
పైపులు, క్లాంప్‌లు, వైర్లు, స్టార్టర్ ఖర్చు	రూ.50,000
ఒక్కొక్క రైతుపై పడే భారం	రూ.1,10,000
తెలంగాణ రైతాంగంపై పడే భారం	రూ.30,000 కోట్లు

1.10 లక్షలకుపైగా తక్షణం పెట్టుబడి

కాంగ్రెస్ నేతల మాటలు నమ్మి రైతులు 10 హెచ్‌పీ మోటర్లు కొనుగోలు చేస్తే అది తలకు మించినభారంగా మారడం ఖాయం. మార్కెట్లో లభించే నాణ్యమైన సీఆర్ఐ, టెక్స్‌మో, సముద్ర, లూబీ, ఎల్లెన్, కిర్లోస్కర్ లాంటి బ్రాండెడ్ 10 హెచ్‌పీ మోటర్ల సగటు ధర సుమారు రూ.50 వేల వరకు ఉన్నది. వీటితోపాటు పైపులు, క్లాంప్‌లు, వైర్లు, డబ్బా, స్టార్టర్‌లకు మరో రూ.50 వేలకుపైగా ఖర్చు అవుతుంది. బోరు లోతు ఎక్కువగా ఉంటే పైపులు, వైర్లకు అయ్యే ఖర్చు మరింత పెరుగుతుంది. వీటిని బిగించడానికి మెకానిక్, ఇద్దరు కూలీల ఖర్చు అదనం. ఈ లెక్కన సగటు ధరలను పరిగణనలోకి తీసుకున్నా రూ.1.10 లక్షలకుపైగా ఒక్కొక్క రైతుపై భారం పడక మానదు. అంటే సగటున ఒక్కో రైతుపై రూ.1.10 లక్షలకుపైగా భారం మోపి, వారిని అప్పుల పాలు చేసేందుకు కాంగ్రెస్ నేతలు వ్యూహం పన్నుతున్నట్టు అర్థమవుతున్నది. ఇప్పుడిప్పుడే గాడిన పడుతూ.. 24 గంటల ఉచిత విద్యుత్తుతో బోర్లు, బావుల్లో ఉన్న భూగర్భ జలాలను వినియోగించుకుంటూ.. రెండేసి పంటలు పండిస్తూ.. వ్యవసాయాన్ని పండుగలా జరుపుకుంటున్న తెలంగాణ రైతాంగంపై కాంగ్రెస్ నేతలు ఎందుకు ఇంతగా కక్ష కడుతున్నారో అర్థంకాని పరిస్థితి. రైతులు 10 హెచ్‌పీ మోటర్లను వినియోగిస్తే 3 గంటల విద్యుత్తు సరిపోతుందని, అందుకు రైతులు సిద్ధంగా ఉండాలంటూ అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్న కాంగ్రెస్ నేతలు అప్పుడే హెచ్చరికలు జారీచేస్తున్నారు. దీనితో తెలంగాణ రైతుల గుండెల్లో ఫిరంగులు పేలుతున్నాయి.

ఏ మాత్రం లాభం ఉండదు

ఇంత కష్టపడి 10 హెచ్‌పీ మోటర్లు కొనుగోలు చేస్తే.. రైతులకు ఏమన్నా ఉపయోగం ఉంటుందా? అంటే అదీలేదు. 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లను పక్కనపెట్టి 10 హెచ్‌పీ మోటర్లు బిగించడం వల్ల పంట దిగుబడి పెరిగేదేమీ ఉండదు. ఆదాయంలో ఎటువంటి మార్పూ ఉండదు. కాబట్టి చేతి చిలుము వదిలించుకోవడం తప్ప రైతులకు ఒరిగేదేమీ లేదు. రైతులకు ఏ మాత్రం మేలు చేయని 10 హెచ్‌పీ మోటర్ల కోసం అదనపు భారం మోపేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారో కాంగ్రెస్ నేతలకే తెలియాలి.

కాంగ్రెస్‌ది కొంపలుముంచే ఆలోచన

కాంగ్రెస్ నేతలెవరూ వ్యవసాయం చేస్తున్నట్టుగా లేదు. అందుకే ఇలాంటి దుర్మార్గ ఆలోచనలు వస్తున్నాయి. ఏ ప్రభుత్వమైనా రైతులపై భారం పడకుండా లాభం కలిగించే పథకాలను ప్రవేశపెట్టాలి. కానీ తెలంగాణ కాంగ్రెస్ నేతలు మాత్రం రైతులపై భారం వేయడానికే 10 హెచ్‌పీ మోటర్లు, 3 గంటల కరెంటు అనే తలతిక్క ఆలోచనలు చేస్తున్నట్టు కనిపిస్తున్నది. స్వయంగా వ్యవసాయం చేస్తున్న సీఎం కేసీఆర్ ఇందులోని దుర్మార్గాన్ని రైతులకు వివరిస్తున్నారు. ఇది కొంపలు ముంచే యవ్వారం అని హెచ్చరిస్తున్నారు. ఒక్క ధాన్యపు గింజ ఉత్పత్తిని కూడా పెంచకపోగా ఒక్కో రైతుపై అదనంగా రూ.1.10 లక్షల భారాన్ని మోపి, రుణగ్రస్తులగా మార్చే కుట్రలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెడకాయపై తలకాయ ఉన్నోడెవడైనా.. ఇలాంటి చచ్చుమాలిన పథకాన్ని చెప్తారా? అని మండిపడుతున్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మితే లక్షలు ఖర్చు పెట్టి 10 హెచ్‌పీ మోటర్లు కొనుక్కోవాల్సి వస్తుందని, నిక్షేపంగా పనిచేస్తున్న ప్రస్తుత మోటర్లను తక్కు సామాను కింద అమ్ముకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నాయకులైనా, ప్రభుత్వమైనా రైతులకు సాయం చేయాలే తప్ప వారిపై పెన